# కరటక దమనకులు

అదొక ఆఫీసు. సముద్రంలోని జలచరాల్లా అందులో రకరకాల హోదాల్లో ఉన్న వాళ్ళు చాలా మంది పనిచేస్తున్నారు.

అయితే, ఆ ఆఫీసులో వింతయిన జంట కరటక దమనకులు.

వారికి లంబు–జంబులని, వాలి–సుగ్రీవులని, ఇంకా కొంచెం దూరం పోతే లారెల్ హార్డీలని ఇతరత్రా నామధేయాలున్నాయి.

యదార్థాని కొస్తే కరటకుడి అసలుపేరు గంగారాం. ఆ ఆఫీసులో సీనియర్ అసిస్టెంటు హోదాలో పనిచేస్తున్నాడు. ఎర్రగా, లావుగా పీపాలా ఉంటాడు. నడుస్తూంటే ఇతని నడుము బాతు నడుములా ఊగుతూ ఉంటుంది. ఇతని ఇతర పేర్లే లంబు, వాలి, లారెల్. ఆఫీసులో లేడీస్ మాత్రం ఇతన్ని ప్రత్యేకంగా 'పిల్లలకోడి' అని పిలుస్తూ ఉంటారు.

ఇకపోతే దమనకుడి అసలుపేరు విష్ణుమూర్తి. ఆ ఆఫీసులో టైపిస్టుగా పని చేస్తున్నాడు. ఇతని ఇతర పేర్లే జంబు, సుగ్రీవుడు, హార్డీ లంబూ శరీరంలోని ఒక అవయవంలా ఎప్పుడూ లంబూనే అంటిపెట్టుకుని ఉంటాడు. నలుపు, తెలుపుకాని ఒక మాదిరి రంగుతో ఉంటాడు. ఫుల్ షర్టులు వేసి పైకి మడుస్తాడు. ఇతను చాలా పొట్టి. కాళ్ళు కురచ. అవడం చేత లంబూని అనుసరించడానికి స్పీడుగా అడుగులు వేస్తుంటాడు. ఈ అలవాటు వల్ల ఎప్పుడూ హడావుడిగా అటూ ఇటూ తిరుగుతుంటాడు. ఇతను పూర్తిగా లంబూకి బానిస. లంబూ మీద ఆధారపడి బతికే ఒక పారసైట్.

ఆఫీసులో ప్రత్యేక తరహాలో ప్రవర్తించే ఈ జంట భార్యాభర్తల కంటే ఎక్కువ అన్యోన్యంగా ఉంటారు. వాళ్ళు ఆకారాల్లో లంబు, జంబులుగాను, ఆలోచనల్లో కరటక దమనకులుగాను, బంధుత్వంలో వాలి సుగ్రీవులుగాను. స్నేహంలో లారెల్ హార్డీలుగాను ప్రవర్తిస్తూంటారు. వీళ్ళిద్దరికీ ఇంత స్నేహం కుదరడానికి కారణం కరటకుడు ఆర్థికంగా ఒక మెట్టు పైనా, దమనకుడు ఒక మెట్టు కింద ఉన్నారు. కరటకుడికి తననెప్పుడూ పొగిడే వాడు కావాలి. దమనకుడికి అప్పుడప్పుడు తనను ఆర్థికంగా ఆదుకొనే వాడు కావాలి. దాంతో ఇద్దరూ ఒకటయ్యారు.

ఆ రోజు సరిగ్గా ఉదయం పది గంటలకు కరటక దమనకులిద్దరూ ఒకేసారి ఆఫీసు ముందు సైకిళ్ళు దిగారు. కరటకుడు తన సైకిల్ని దమనకుడి చేతికిస్తే దమనకుడు తన సైకిల్‌తోబాటు దాన్ని స్టాండులో పెట్టి లాక్ చేసి కీ కరటకుడి చేతి కిచ్చాడు.

ఇద్దరూ ఆఫీసులోకి ప్రవేశించి అటెండెన్సు రిజిస్టర్లో సంతకం పెట్టారు. తమ సీట్లోకి పోతూ పోతూ సీట్లో కుదురుగా కూర్చుని పని చేసుకుంటున్న కామేశ్వరరావుని చూశారు. అతని కొత్త బట్టలు చూసేసరికి గంగారాం కళ్ళు ఎర్రబడ్డాయి.

"హలో కామేశ్వరరావ్! కొత్త పెళ్ళికొడుకులా ఉన్నావోయ్." మెచ్చుకొంటూ అతను వేసుకొన్న చొక్కా చేత్తో పట్టుకొని చూశాడు విష్ణుమూర్తి.

"గురుడికి మంచిపార్టీ తగిలినట్లుంది" అన్నాడు గంగారాం.

"లేదురా. పండుక్కు మా అత్తగారు పెట్టారు" అన్నాడు కామేశ్వరరావు.

"మా కంతా తెలుసులేవోయ్ నువ్వెలా సంపాదించిందీ."

"చ...వెధవ[లా మీరు! ఎన్ని చెప్పినా మీ నీచబుద్ధి పోదు."

"ఒరే! ఎన్నయినా అనుకో. ఈ సూటు పార్టీలు కొని పెట్టిందే. ఇది తథ్యం."

"కరక్టే. హ్హ...హ్హ...హ్హ...హ్హ..." గంగారాం మాటలకు వంత పలికేడు విష్ణుమూర్తి.

వాళ్ళ మాటలకు ఎవరూ విలువ నివ్వరు కాబట్టి ఎవరూ పట్టించుకో లేదు కామేశ్వరరావుకూడా తలవంచుకుని తన పనిలో తాను మునిగి పోయాడు.

ఇంతలో టైపిస్టు విష్ణుమూర్తి గొంతు పెద్దగా వినిపించింది.

"నాకు బోలెడు అర్జంటు పనులున్నాయి. ఇప్పుడు తీరదు."

"ఇది బాస్ అర్జంటని చెప్పాడురా! త్వరగా చేయి." క్లర్కు నారాయణరావు గొంతు.

"ఒరే నారాయణరావ్! తైలం పడందే ఏ పనీ జరగదురా. యదార్థం చెబుతున్నాను."

"సరే నీ ఇష్టం. చేస్తే చెయ్. లేకపోతే లేదు. నేను ఆఫీసరుకు విషయం చెప్పేస్తా."

"ఒరేయ్! దమనకుడితో పెట్టుకొన్నావా ఇక అయినట్లే! నువ్వు ఆఫీసరుతో చెప్పావనుకో వాడు టైప్ మిషనులో ఓ పార్టు ఊడపీకి మిషను చెడిపోయిందంటాడు. మొదటికి మోసమవుతుంది" అన్నాడు కామేశ్వరరావు.

"హ్హ.. హ్హ...హ్హ..." ఆనందంగా నవ్వాడు విష్ణుమూర్తి.

"తెలుసుకొన్నావుగా వాడి దెబ్బ? మాతో మర్యాదగా ఉంటేనే పనులు జరుగుతాయి" అన్నాడు గంగారాం గర్వంగా.

"నిజమే. ఏం చేస్తాం బాబూ? కాలం మీది" ఒప్పుకొన్నాడు నారాయణరావు ఆ ఫైలు అక్కడే పెట్టి వెళ్ళిపోయాడు.

ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు. లంచ్ టైమ్‌లో భోజనం చేయడానికి తమ కారియర్లు తీసుకొని డైనింగు హాలువైపు పోతున్నారంతా.

రాస్తున్న ఫైలు మధ్యలో వదలి వెళ్ళడానికి బుద్ధిపుట్టక పని చేసుకుంటున్న మాధవి దగ్గరకొచ్చారు కరటక దమనకులు.

"హల్లో మాధవిగారూ! వెలిగిపోతున్నారే. ఈ మధ్య ఏదో మిక్సీ, అలారం టైంపీస్, ఐరన్ బాక్స్ కొన్నారటగా? బాగా పని చేస్తున్నాయా?" అడిగాడు కరటకుడు.

"బాగానే పనిచేస్తున్నాయండి."

"వాటి ఖరీ దెంతండి?" దమనకుడి సందేహం.

"సుమారు వెయ్యి రూపాయలండి."

"మీ జీతమెంత?"

"తొమ్మిది వందలు."

"ఈ రోజుల్లో ఇంటి అద్దె, మిగతా ఖర్చులకు మాకు జీతాలు బొటాబొటిగా కూడా చాలనప్పుడు, తొమ్మిది వందల జీతంతో మీరు నెలకొక చీర, మిక్సీ ఇతర్రా ఎలా కొనగలరు?"

"నేను చాలా పొదుపు చేస్తానండి" ఆడవాళ్ళంకదా. అందులోనూ ఒంటరిదాన్ని. ఇంటికి పంపాల్సిన అవసరం లేదు. మావాళ్ళే

ఇవన్నీ నన్ను కొనుక్కోమన్నారు. అదీగాక పోయిన నెలలో సరెండరు లీవు. ఫెస్టివల్ లీవు అడ్వాన్స్ తీసుకొన్నాను గదండీ!"

అప్పటివరకూ ఒకరి తరువాత మరొకరుగా ప్రశ్నలవర్షం కురిపిస్తున్న కరటక దమనకులు "అబ్బే మేం నమ్మం" అన్నారు ఇద్దరూ ఒకేసారి.

"ఇందులో ఏదో రహస్యం ఉండాలి."

"ఒరేయ్ చెప్పమంటావా?" అన్నాడు కరటకుడు.

"అంటావా కాదు. చెప్పు వింటా" అన్నాడు దమనకుడు.

"అదేమిటి?"

"ఆడదానిగా పుట్టించడమే."

"పుట్టిస్తే మాత్రం?"

"ఓ పిచ్చివాడా! ఆడదిగా పుట్టింది కనుకనే ఆ అదృష్టం. ఆడది తన చాకచక్యంతో ఒక్క మిక్సీ ఏమిటి టి వి లు కొంటుంది." టాక్సీలు కొంటుంది.

"నీ శిష్యుడికి జ్ఞానోదయమైంది గురూ! మాధవి ఇన్ని వస్తువులు ఎలా కొనగలిగిందో నా కళ్ళకు కట్టినట్లు కన్పిస్తోంది. ఇక పద."

దమనకుడి భుజం తట్టిన కరటకుడు "భేష్! విషయాలు నన్నడిగి తెలుసుకొంటూ ఉండు. బాగుపడతావు. ఇంకా చాలా చెబుతాను" అంటూ బయటకు నడిచాడు. దమనకుడు అతణ్ని అనుసరించాడు.

మాధవి తల పట్టుకొంది. కన్నీళ్ళు కారాయి. ఛీ...ఏం మనుషులు ఈ గంగారాం, విష్ణుమూర్తి! వీళ్ళకు మరేం పనిలేదా? ప్రతి ఒక్కరినీ పరిశీలించడం, వాళ్ళ జీవితాలతో ఆటాడుకోవడం, ఇంతమంది

ఆఫీసు స్టాఫు తనతో ఎంతో మర్యాదగా మాట్లాడుతుంటారు. కాని వీళ్ళు తను వివాహం కానిది. వీళ్ళ ప్రచారాలు తన జీవితానికి ఎంత మచ్చ? అనుకొంది.

* * * *

ఆ సాయంత్రం ఆఫీసరు దగ్గరనించి టైపిస్టు విష్ణుమూర్తికి పిలుపొచ్చింది. విష్ణుమూర్తి వెళ్ళి ఆఫీసు కెదురుగా నిలబడ్డాడు.

"ఏమయ్యా ఇంపార్టెంట్ ఏదో అనింపార్టెంట్ ఏదో తెలుసుకోకపోతే ఎలా? పై అధికార్లకు వెళ్ళాల్సిన అర్జంటు పేపర్లు డిలే చేస్తావా?"

"ఏం డిలే చేశాను సార్?"

"అదే నారాయణరావు తెచ్చిన ఫైలు."

"చేసేవాణ్నే సార్...కాని..."

"కాని ఏమిటి చెప్పు?"

"చెప్పడం బాగుండదని చెప్పలేకపోతున్నాను సార్. మీరేమనుకోనంటే..."

"నేనేమీ అనుకోను చెప్పవయ్యా బాబూ!"

"సార్! నారాయణరావు సంగతి మీకు తెలియదు. వాడోలుచ్చా. ఇందాక ఫైలుతెచ్చి నా దగ్గర పెట్టి వెళ్ళిపోకూడదూ. మిమ్మల్ని గురించి ఎంత అసహ్యంగా మాట్లాడాడని?"

"ఏం కూశాడు? ఆఫీసరుకు బి.పి పెరిగింది. మీరొక దుర్మార్గుఅట. బానిసల్లా గుమాస్తాలచేత పని చేయిస్తారట. ఈ కర్కోటకుడు పోతేగాని నాకు శాంతిలేదురా విష్ణుమూర్తీ. ఇతనికి ట్రాన్స్‌ఫరయితే దేవుడికి నూరు కొబ్బరికాయలు కొడతాన్రా అంటూ నా ముందు ఏడ్చేశాడు.

సార్! మీరంటే మాకెంతో గౌరవం, అభిమానం. అందుకే మిమ్మల్ని వాడిలా అంటుంటే వినలేకపోయాను. దాంతో మీకు విషయం చెబుదామనే ఎదురుచూస్తున్నాను. నారాయణరావు తెచ్చిన ఫైలు టైపుచేసి నా దగ్గర పెట్టుకొని ఉన్నాను. ఇప్పుడే మీకు పంపిస్తాను."

ఎంతో మంచివాడనుకునే నారాయణరావు మనసులో తనను గురించి ఇటువంటి దురభిప్రాయం ఉందనుకొనేసరికి ఆఫీసరుకు చాలా బాధ వేసింది.

"నమ్మమంటావా విష్ణుమూర్తి!"

"సార్! నేనెప్పుడూ అబద్ధాలు చెప్పను. కావాలంటే సీనియర్ అసిస్టెంటు గంగారాంను అడగండి. అతనూ పక్కనే ఉన్నాడు."

ఆఫీసర్ బెల్ కొట్టాడు.

వెంటనే అటెండరు వచ్చాడు.

"వెళ్ళి గంగారాంని పిలువు."

కొద్ది సేపట్లో గంగారాం లోపలికి వచ్చాడు.

"ఉదయం నారాయణరావు టైపిస్టు విష్ణుమూర్తి దగ్గరకు ఫైలు తెచ్చిన తరువాత జరిగింది జరిగినట్లు చెప్పు!"

"ఏముంది సార్! ఉదయం నారాయణరావు ఫైలుతెచ్చి మిమ్మల్ని నానా దుర్భాషలాడుతూ మాట్లాడాడు సార్! నేనూ విష్ణుమూర్తీ ఎంత చెప్పినా వినందే" అంటూ విష్ణుమూర్తి చెప్పినట్లే చెప్పాడు ముందు మాట్లాడుకొన్న ప్రకారం. దాంతో ఆఫీసరుకు నమ్మక తప్పలేదు.

"వెంటనే నారాయణరావుని పిలిపించి ఉతికి ఆరేస్తాను. ఎదురు మాట్లాడితే సస్పెండ్ చేసి పారేస్తాను." ఆవేశంగా అన్నాడు ఆఫీసరు.

"సార్! మీరు రెండవసారి మాట్లాడిన మాటే బాగుంది. వాడితో ముఖాముఖీ మాట్లాడకండి. చార్జిమెమో ఇచ్చి సంజాయిషీ మీద సస్పెండ్ చేయండి."

"అప్పుడొస్తుంది ఆ నారాయణరావుగాడికి బుద్ధి"

"మీ ఐడియా కూడ బాగానే వుంది" మెచ్చుకొన్నాడు ఆఫీసర్.

వెంటనే ఛార్జి మెమో తయారు చేయడంలో మునిగిపోయాడు.

లంకాదహనం చేసినంత ఆనందంతో బయటపడ్డాడు కరటక-దమనకులు.

మరునటి రోజు ఛార్జి మెమో అందుకొన్న నారాయణరావుకు దిక్కుతోచలేదు. నేరుగా ఆఫీసరు దగ్గరకు వెళ్ళి చెప్పడానికి బుద్ధి పుట్టక సెక్షన్ హెడ్ దగ్గరకు వెళ్ళి భోరుమన్నాడు.

"సార్ ఇంత కష్టపడి పని చేసినందుకు నాకు లభించిన అవార్డు ఇదా!" అన్నాడు.

సెక్షన్ హెడ్ ఉద్యోగుల సాధక బాధలు తెలిసినవాడు. ఎవరు కష్టపడి పనిచేసేదీ ఎవరు చేయనిదీ అతనికి తెలుసు. తనకు తెలిసినంతలో నారాయణరావు సిన్సియర్ వర్కర్. ఒళ్ళు దాచుకోకుండా పని చేస్తాడు.

"నేను ఆఫీసరుతో మాట్లాడుతాను. నిశ్చింతగా వుండు. ఛార్జి మెమోకి ఎక్స్‌ప్లెనేషన్ ఇవ్వడానికి ఇంకా వారం రోజులు టైముందిగా" అంటూ ఓదార్చాడు.

దాంతో నారాయణరావుకి కొంత ధైర్యమొచ్చింది.

తరువాత కొద్ది సేపటికి సెక్షన్ హెడ్ ఆఫీసర్ రూములోకి వెళ్ళి

ఏదో ఫైలు విషయం మాట్లాడుతూ-మాట్లాడుతూ మధ్యలో నారాయణ రావు సంగతి ఎత్తాడు.

దాంతో ఆఫీసరు భగ్గున మండిపోయాడు.

"ఆఫ్టారిల్ గుమాస్తా...ఆఫీసర్నే విమర్శిస్తాడా?" అంటూ గంగారాం విష్ణుమూర్తి చెప్పిన విషయాలు చెప్పాడు.

అంతా విన్న సెక్షన్ హెడ్ చిన్నగా "సార్ ఆ గంగారాం, విష్ణు మూర్తి సంగతి మీకు తెలియనిదేముంది? వాళ్ళు చాలా నీచులు, దుర్మా ర్గులు. ఒకరు పచ్చగా వుంటే చూడలేరు. అందరిమధ్యా తగాదా పెట్ట డమే వాళ్ళ ధ్యేయం. వాళ్ళని కరటక దమనకులని అందరూ పిలు స్తూండేది మీకు తెలుసుగా" అంటూ వాళ్ళ కుళ్ళు బుద్ధి అంతా విడ మరిచి చెప్పాడు.

ఎంత చెప్పినా ఆఫీసరు నమ్మలేదు" అయినా ఎవర్నో ఏదో అనుంటే ఊరుకొనుండేవాణ్ణిగాని నన్నంటే నే నూరుకోను ఆఁ..." అంటూ ఎగిరిపడ్డాడు.

ఇక ఎంత చెప్పినా ఆఫీసర్ నమ్మడని తెలుసుకొన్న సెక్షన్ హెడ్ తన సీట్లోకి వచ్చి కుర్చున్నాడు.

"ఆ కరటక దమనకుల్ని రమ్మని చెప్పు" అన్నాడు సెక్షన్ హెడ్.

అటెండర్ చెప్పిన గంటకు ముందు గంగారాం, వెనుక విష్ణు మూర్తి "నమస్కారం సార్" అంటూ వచ్చారు.

కాఫీలు తెప్పించాడు సెక్షన్ హెడ్.

"మీరు తెప్పించడం దేనికి సార్!" అంటూ మొహమాటం నటిం చారు ఇద్దరూ.

"మనతోటి ఉద్యోగస్తుల్ని మనం బ్రదర్స్‌లాగా చూసుకోవాలి గంగారాం. ఏమంటావు విష్ణుమూర్తి!"

"బ్రదర్స్‌లాగా ఏమిటి సార్. మేనమామల్లాగా చూసుకొంటున్నాం... హి...... హి... హి..." అంటూ బిగ్గరగా నవ్వాడు విష్ణుమూర్తి.

"మా శిష్యుడు చెప్పిందే నా మాట" అన్నాడు గంగారాం.

"కానీ మీ తోటి ఉద్యోగి నారాయణరావు విషయంలో మీరు చేసిన పని నాకు నచ్చలేదు."

"సార్! వాడి సంగతి మీకు తెలియదు. వాడు మమ్మల్నే ఎదిరిస్తున్నాడు."

"ఏమనుంటాడు? గుమాస్తాల సర్కిల్‌లో మీరు ఏదో సరదాగా మాట్లాడుకొని ఉంటారు. దాన్ని మీరు పై ఆఫీసర్ దృష్టికి తీసుకుపోవడం ఏం బాగా లేదు."

"అతనికి సరైన శిక్ష ఇదే."

"కాని ఇది మంచిదికాదు మిస్టర్స్! ఆఫీసులో పనికంటే మీకు మాటలు ఎక్కువ. కష్టపడి పనిచేసే ఆడవాళ్ళని సూటి పోటి మాటల్తో బాధపెట్టడం మీ నైజం. ఇది మంచి పద్ధతి కాదని ఇప్పటికయినా గ్రహించి మీ పద్ధతి మార్చుకొంటే మంచిది లేకుంటే చాలా ఇబ్బందుల్లో పడతారు."

గంగారాం, విష్ణుమూర్తి ముఖాలు నల్లగా మాడిపోయాయి. "సరే సార్ మీరు చెప్పినట్లే వింటాం" అంటూ అక్కడ్నుంచి బయటపడ్డారు.

ఇద్దరూ తమ సీట్లలో కూర్చొని బుసలు కొట్టారు.

వారం రోజుల్లో సెక్షన్ హెడ్‌ని ఆ ఆఫీసునుంచి వేరే ఆఫీసుకు మారుస్తున్నట్లు ఆర్డర్సు వచ్చాయి. దానికి కారణం అతను ఆఫీసులో కొంత పక్షపాత వైఖరి అవలంబిస్తున్నట్లు, దానివల్ల మిగతా వాళ్ళకు చాలా అన్యాయం జరుగుతున్నట్లు.

దీనికి కారణం ఎవరో సెక్షన్ హెడ్‌కు తెలుసు. ఇది ఎవరిదో కాదు, కరటక దమనకుల కుటిల రాజకీయం.

ఒక ఉద్యోగస్థుణ్ని మూడు సంవత్సరాలు దాటితేనేగాని ఇంకో ఆఫీసుకు బదిలీ చేయకూడదు. అలాంటిది తను వచ్చి ఏడాది గడవక ముందే ట్రాన్స్ఫరు చేయడం అమానుషమని, తన పక్షపాత బుద్ధిని నిరూపించ గలిగితే తనను ఎక్కడకు వేసినా వెళ్ళడానికి సిద్ధమేనని అప్పీలు చేసుకొన్నాడు. పై ఆఫీసరు ఆ అప్పీలమీద స్టే ఇచ్చాడు.

ఈ కారణంగా సెక్షన్ హెడ్ ట్రాన్స్ఫర్ తాత్కాలికంగా ఆగి పోయింది.

దీంతో గంగారాం, విష్ణుమూర్తిల దమన నీతి ఆఫీసులో బాగా తేటతెల్లమైంది.

* * * *

జయశ్రీ ఆ రోజు అందంగా అలంకరించుకొని తన సీట్లో కూర్చొని వుంది. స్వతహాగా అందగత్తె. దానికితోడు గ్రాడ్యుయేటు. ఆమెకు ఆ ముందురోజే పెళ్ళి చూపులకు వచ్చారు. అబ్బాయి ఇంజనీరు. ఇరు వర్గాల వారికీ ఒకరికొకరు నచ్చారు. ఆమె అందానికి మురిసి కట్నం లేకుండానే పెళ్ళి చేసుకొంటానన్నాడు ఇంజనీరు.

ఈ విషయం టైపిస్టు విష్ణుమూర్తి గంగారాం చెవిన వేశాడు.

"ఒరే దానికెంత గర్వంరా! దానికి ఇంత మంచి సంబంధమా?"

"అవును గంగారాంజీ...దానిబెట్టూ అదే. ఎంత రిజర్వుడుగా వుందని?"

"అందుకే ఈ పెళ్ళి మనం ఎగరగొట్టెయ్యాలి."

"తప్పదు. గురువాజ్ఞ."

"వెళ్దాం పద" అంటూ ఇద్దరూ జయశ్రీ దగ్గరకొచ్చారు.

"కంగ్రాచ్యులేషన్స్" అన్నారిద్దరూ.

"దేనికండీ?" అంది ఎంతో మర్యాదగా జయశ్రీ.

"అదేనండీ నిన్న మీకు పెళ్ళి చూపులు జరిగాయి కదా. వరుడు ఇంజనీరటగా!"

"ఎవరు చెప్పారండీ ఇవన్నీ!"

"మాకు ఒకరు చెప్పనవసరం లేదండి. ఎంత రహస్యాలయినా వాటంతట అవే మాకు తెలిసిపోతుంటాయి."

"అయితే కాబోయే వరుడు ఏ డిపార్ట్‌మెంటులో పనిచేస్తాడండీ!"

"పి. డబ్ల్యు డిపార్ట్‌మెంటు."

"ఏ ఊరు?"

"గుంటూరు"

"చాలా ఇంకేమైనా ఇన్ఫర్మేషను కావాలా" అన్నట్లు చూశాడు గంగారాం విష్ణుమూర్తివైపు.

"పేరండీ?" అడిగారు విష్ణుమూర్తి.

"కె చంద్రశేఖర్."

చాలన్నట్లు సైగచేశాడు విష్ణుమూర్తి. అంతే. ఇద్దరూ బయటికి నడిచారు.

ఫోటో స్టూడియోకెళ్ళి గంగారాం చెప్పిన పని పూర్తిచేసి వచ్చే సరికి రాత్రి తొమ్మిదయింది. విష్ణుమూర్తి ఇంటికెళ్ళేసరికి అతని భార్య బయట కాళ్ళు బారజాపి అరుగుమీద కూర్చొని చుట్ట పీలుస్తూ గుప్పు గుప్పున పొగ వదుల్తోంది.

దాంతో విష్ణుమూర్తికి ఒళ్ళు మండిపోయింది.

"బుద్ధుందటే నీకు? వీధిలో కూర్చొని చుట్ట పీలుస్తావా?"

"ఏందయ్యోయ్ పెద్ద సెపొచ్చినవ్! మా అయ్యబుద్ధి తక్కువై పదివేలు కట్నమిచ్చి చచ్చుదద్దమ్మని నిన్ను కొనుక్కొచ్చిండు. ఆ పది వేలు పోసి పందుల్ని కొనున్నా ఇప్పటికి యాభయ్‌వేల రూపాయలు చేసే పిల్లల్ని ఈనుండేయి. ఆఁ..."

"ఖర్మ, ఖర్మ! నువ్వు నా పెళ్ళానివి కాదే! నా మొగుడివి. నాకు ఇద్దరు మొగుళ్ళే. ఒకడు గంగారాంగాడు, రెండు నువ్వూ"

"నానంటే నానొప్పుకొంటా. మరి అ గంగారాంగాడు నీకు మొగు డెట్టా అయ్యాడో కాస్త సెప్పు సూద్దాం"

"నీకు దండం పెడతా లోపలికి రావే. అవన్నీ తరవాత చెబు తాను."

"నాను రానంటే రాను. అడు నీకు మొగుడెట్టా ఆయ్యాడో సెబితే గాని రాను"

ఇంకో చుట్ట వెలిగించింది విష్ణుమూర్తి భార్య.

"ఏం చేసేదే? నా జీతం నీ చుట్టలకు చాలకపోయె. వాణ్ణి ఆశ్ర

యిస్తే నాల్రూపాయలు వస్తున్నాయి. అట్లా ఈ బ్రతుకు ఈడ్చు కొస్తున్నా."

"అంటే నా లంగరు చుట్టలకే నీ జీతమంతా తగలేస్తుందావన్న మాట! ఓరయ్యో! యాడుండావురో నా అయ్యా! ఉద్యోగస్తుదని ఇట్టా టోడికి తగలగట్టినవు. నానెట్టా బ్రతకాల్రో దేవుడో!" శోకాలు పెడుతూ ఏడవసాగింది.

విష్ణుమూర్తి భార్యను బ్రతిమాలి ఇంట్లోకి తీసుకుపోయాడు. తరువాత చకచకా వంటా వార్పు పూర్తిచేశాడు. ఈ లోపల శోకాలు పెడుతూ దాదాపు పది చుట్టలు తగలేసింది అతని భార్య.

* * * *

"ఏమయ్యా ఇది ఫైలా లేక నీ ఇంటిలో చిల్లర పద్దుల లెక్కా? పై ఆఫీసర్లకు పోయే ఇన్ఫర్మేధను ఇలాగా ఏడ్చేది?" ఫైలు చదువుతూ అన్నాడు ఆఫీసరు.

గంగారాం నీళ్ళు నమిలాడు.

"మనస్సు ఎక్కడ పెట్టుకుంటావయ్యా! నీకు శరీరం ఉందేగాని మెదడు లేదు. ఫైలు బాగా చదివి ఎగ్జామిన్ చేసి ఆలోచించి రాయి" అంటూ ఫైలు విసిరి గంగారాం ముఖాన కొట్టాడు.

అనుకోని ఈ పరిణామం గంగారాంకి చాలా అవమాన మనిపించింది. అందులోను ఇది జరిగింది కాన్ఫరెన్స్‌లో అంతమంది ముందు.

కాన్ఫరెన్స్ అయిం తరవాత హాల్లోనుంచి బయటికి వచ్చిన గంగారాం తన బాధకంతా విష్ణుమూర్తి ముందు వెళ్ళబోసుకున్నాడు.

గురువుగారంతటివాడు తన దగ్గర మొరపెట్టుకొనేసరికి విష్ణుమూర్తికి తను ఎంతో ఎదిగిపోయినట్లనిపించింది!

తను గురువుగా, గంగారాం తన శిష్యుడుగా ఊహించుకున్నాడు.

"ఒరే మూర్తీ! మన పతనావస్థ దగ్గరకొచ్చినట్లుందిరా!"

"లేదు గురువుగారూ! అలా ఎందుకనుకోవాలి?" ఓదార్చసాగాడు విష్ణుమూర్తి.

గంగారాం ఏదో అనబోయాడు. ఇంతలో జయశ్రీ వచ్చి ఇద్దరికీ నమస్కారం పెట్టింది.

"సార్! మీరు చేసిన మేలు మరచిపోలేను. ఇంజనీరుతో నా పెళ్ళి తప్పిపోయింది సార్!" అంది

ఇద్దరూ ఎగిరి గంతేశారు.

"చూశావా గూరూ! మనకు పతనావస్థ దగ్గరకు వచ్చిందంటివే. ఈ విజయం చూశావుగా?" అన్నాడు విష్ణుమూర్తి.

"నిజమే మనమే జయించాం. కాని జయశ్రీగారెందుకో ఆనందంగా ఉన్నట్లున్నారు అదే నా బాధ!"

"నా ఆనందానికి కారణం మీ పుణ్యమా అని ఈ సంబంధం తప్పిపోవడమే. ఇంజనీర్‌కు టి.బి. జబ్బట. అది ఈరోజే మా బంధువుల ద్వారా తెలిసింది. మీ ఉత్తరం ద్వారా వాళ్ళు మా సంబంధం కాన్సిల్ చేసుకోవడం నాకెంతో మేలు చేసింది."

"చూశావా? మనం ఓడిపోవడానికి ఇదొక నిదర్శనం. అవతలి వాళ్ళను బాధపెట్టడమే కదరా మన జీవితాశయం. అలాంటిది మన వాళ్ళకు మంచిపనులు జరుగుతున్నాయంటే బాధగా ఉంది మూర్తీ!"

"డోంట్ వర్రీ! ఓ ఫిఫ్టీ ఉంటే పడెయ్." అని గురువుగారు

కోపంగా ఉన్నారని గ్రహించి "టన్లీ టెన్ రూపీస్ ప్లీజ్" అన్నాడు మళ్ళీ.

ఏడుస్తూ జేబులోంచి పదిరూపాయల నోటు తీసి టైపిస్టుకు అందించాడు.

రెండు నెలల క్రితం ఆఫీసు స్టాఫ్ గ్రూప్ ఫోటో తీయించుకున్నారు. ఒక వరస కూర్చుంటే రెండు వరుసలు నిలబడి ఉన్నారు. కూర్చొన్న వరుసలో సగంమంది మగవాళ్ళు, పక్కనే సగంమంది ఆడవాళ్ళు కూర్చొని ఉన్నారు. అందులో సెక్షన్ హెడ్ ప్రక్కనే జయశ్రీ కూర్చొని ఉంది జయశ్రీ ప్రక్కనుంచిమిగతా లేడీస్ కూర్చొనున్నారు. సెక్షన్ హెడ్ ప్రక్కనే జయశ్రీ ఉండడంతో. గంగారాం, విష్ణుమూర్తి ఇద్దరూ ప్లానువేసి ఫోటో స్టూడియోకి వెళ్ళారు.

నెగిటివ్‌సి వెతికించి సెక్షన్ హెడ్‌ని, జయశ్రీని మాత్రమే జాగ్రత్తగా డెవలప్ చేయించి డెవలప్‌మెంటు ఖర్చులకుగాను వంద రూపాయలు ఇస్తామని యాభయ్ రూపాయలు మాత్రమే ఇచ్చి మిగతాది ఎగవేయడంలో అసలు విషయం బయటపడింది.

సెక్షన్ హెడ్, జయశ్రీ పక్కపక్కనే కూర్చొని ఉన్న ప్రింటులను గుంటూరులో వున్న ఇంజనీర్‌కు పంపిస్తూ, వారిద్దరికి చాలాకాలం నుంచి అనుబంధం ఉందనీ, ఆ అనుబంధం యింత అని చెప్పలేమనీ, అది ఫోటోలు తీయించుకోవడం వరకు వచ్చిందంటే మిగతాది మీరే అర్థం చేసుకోవాలనీ రాసిన ఉత్తరం జతచేశారు. వీళ్ళ కుతంత్రపు ఆలోచన ఒకరిద్దరికి చెప్పగా ఇది ఆ నోటా–ఈ నోటా వచ్చి జయశ్రీకి తెలిసింది.

ఇంటికి వచ్చి తల పట్టుకొని కూర్చున్నాడు గంగారాం.

"ఏమయింది గంగారాం అలా ఉన్నావ్?" అంది అతని భార్య.

ఆమె గ్రాడ్యుయేట్. స్త్రీలకు సమాన హక్కులు ఉండాలంటుంది. అందుకే ఇద్దరూ పేర్లు పెట్టి పిలుచుకొంటారు.

గంగారాం ఏం మాట్లాడలేదు.

"మీ ఆఫీసరు మెదడు లేని మనిషన్నాడనా ఏమిటి?"

"అరె. నీకెలా తెలుసు?"

"ఇందులో గొప్పేముంది? వివాహంనాడే నీకు అది లేదని తెలుసు కొన్నాను. మీ ఆఫీసరు ఎప్పుడో ఒకనాడు ఆ మాటంటాడని తెలుసు. నువ్విలా తల పట్టుకొని కూర్చుంటావనీ తెలుసు."

గంగారాం పిచ్చివాడిలా చూశాడు.

"బాధపడకు గంగారాం! నీ పని పూర్తిచెయ్. నేను అన్నం వండాను. చారు పెట్టాను. ఇప్పుడు నీ వంతు చేపలు తోమడం, కూర వండడం."

"ఈ రోజు నా భాగం కూడా నువ్వే చెయ్. రేపు సెలవు పెట్టి పూర్తిగా వంట పని చేస్తాను."

"అవేం కుదరదు గంగారాం! సమాన హక్కులు అంటే సమాన హక్కులే!" అంటూ ఈజీఛెయిర్లో కూర్చొని తన అభిమాన రచయిత నవలా పఠనంలో మునిగిపోయింది.

గంగారాం లుంగీలోకి మారి, షర్టు హాంగర్‌కు తగిలించి చేపలున్న బుట్ట పట్టుకొని బావి దగ్గరకు నడిచాడు.

• • • •

రోజులు గడుస్తున్నాయి. కరటక దమనకులు ఆఫీసులో అందర్నీ విమర్శిస్తూనే వున్నారు. ఒకరు ఆనందంగా ఉంటే వీళ్ళకు అమితమైన బాధ.

ఆ రోజు గంగారాం దగ్గరకు వచ్చిన శేఖరం ఆ మాట చెప్పే సరికి గంగారాం నమ్మలేదు.

"అలా వెళ్ళి కాఫీ తాగుదాం రా. చెప్పింది విని ఇది ఎంతవరకు నమ్మొచ్చో తరువాత నిర్ణయించుకొందువు" అంటూ ప్రక్కనే వున్న ఆఫీసు కాంటీన్‌లోకి తీసుకెళ్ళి రెండు బ్రూ కాఫీలకు ఆర్డరిచ్చాడు.

కాఫీ తాగుతూ చెప్పాడు శేఖరం "నిన్న విష్ణుమూర్తి నాకు బజారులో కనబడ్డాడు గురూ! నీకో మాట చెబుతాను అంటూ గంగారాం ఇక్కడెక్కడా లేడుగదా" అన్నాడు రహస్యంగా. 'లేడు' అన్నాను. 'నీ లైఫ్‌కు సంబంధించిన ఒక రహస్యం చెబుతాను. ఏమిస్తావ్' అన్నాడు. 'యాభయ్' ఇస్తానన్నాను. 'వందిస్తే నీకు జరగబోయే ప్రమాదం చెబుతా' నన్నాడు. 'ఏమిటో చెప్పు' అన్నాను. రేపు నీవూ, అతనూ కలసి ఆడబోయే నాటకంలో నా దగ్గరున్న ఫైలు నువ్వు దాచిపెట్టేట్లు దాని గురించి మీ ఇద్దరూ నాటకమాడి నన్ను సస్పెండు చేయించాలను కొన్నారటగా!"

గంగారాం శేఖర్ మాటలు నమ్మక తప్పలేదు. ఎందుకంటే ఇది తనకు విష్ణుమూర్తికీ మధ్య నున్న రహస్యం. విష్ణుమూర్తికి డబ్బుయావ ఎక్కువ కనుక ఆశకు లోబడి ఈ రహస్యం చెప్పుంటాడనుకొన్నాడు!

ఇంకా ఏం చెప్పాడు?" కోపం అణచుకొంటూ అడిగాడు గంగారామ్.

"దీనికంతటకు కారణం నేను ఈ మధ్య డిపార్టుమెంటు పరీక్ష

లన్నీ పాసవడమట! అవి పాసుకాని నీకు కడుపు మంటగా ఉందట. నీకంటే ముందే నేను ప్రమోషన్‌లో పోకుండా ఉండేందుకు ఈ ప్లాను వేశావుట!"

"చెప్తాను గాడిదకొడుకు పని" కోపం పట్టలేక పైకే అనేశాడు గంగారాం.

"పోనీలే గంగారాం! వాడి బుద్ధి అటువంటిది." ఓదార్చబోయాడు శేఖరం. కాని గంగారాం వినలేదు. ఇంతకాలం తన శిష్యరికం చేసి గురువుకే ద్రోహం చేయడం తట్టుకోలేకపోయాడు.

అదే సమయంలో కూల్‌డ్రింక్ షాపులో ఎదురెదురుగా కూర్చొని ఉన్నారు విష్ణుమూర్తి, జయరాం

"మా గురువుగారు అలా చెప్పరే. ఇంకా ఏమన్నాడు?"

"నువ్వు గంగారాంని ఆర్పేస్తున్నావట. నిన్నొక ఉంపుడుకత్తె లాగ సాకుతున్నాడట. వాడి జీవితం వాడికి చాలదట. విదలగొట్టినా కింద పడక పారసైట్‌లా అతణ్ని పట్టుకొని ఉన్నావట!"

"నో! నేన్నమ్మను. మా గురువుగారు ఈ మాట అన్నారంటే నాకు ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు విష్ణుమూర్తి.

"నమ్మేదీ. నమ్మకపోయేదీ తరువాత సంగతి! నువ్వేదో ఇబ్బందుల్లో ఉన్నట్లున్నావు. యిది తీసుకో" అంటూ ఓ యాభయ్ నోటు అందించాడు జయరాం.

"థాంక్స్ గురూ! నా బాధ అర్థం చేసుకొన్నావు" అంటూ చప్పున ఆ నోటందుకొని జేబులో పెట్టుకొన్నాడు విష్ణుమూర్తి.

ఇంతలో కూల్ డ్రింక్సు వచ్చాయి.

"సారీ జయరాం! నువ్వెన్ని చెప్పినా నేను నమ్మలేక పోతున్నాను. మా స్నేహాన్ని చెడగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నావని నా అను మానం."

"నీ నమ్మకానికి నా జోహార్. అయితే మీ ఇద్దరి మధ్యా రహస్యాలు ఇంకొకరికి తెలియవు కదా?"

"అవును."

"అయితే ఈ సంగతి విని ఏ నిర్ణయమయినా తీసుకో. నిన్న నాకు గంగారాం కనిపించి, 'నీకో విషయం చెబుతా. ఈ రోజు మన జంబుగాడు సెలవులో ఉన్నాడులే ఏం భయం లేదు' అంటూ నా సీటు కెదురుగా కూర్చొని, అసలు విషయం చెప్పాడు. మన ఆఫీసరు సంతకాన్ని ఫోర్జరీ చేసి స్టెనో వసంతకు ఆఫీసర్ లవ్ లెటరు రాసినట్లూ, వసంత సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆఫీసరుకు ఆమె లవ్ లెటరు రాసినట్లూ ఉత్తరాలు రాసి ఆ రెండూ జతచేసి మన హెడ్ ఆఫీసుకు పంపిస్తూ ఆఫీసరు ఆఫీసులోనే శృంగార క్రీడలు మొదలెట్టాడనీ, వెంటనే ట్రాన్స్ఫరు చేయాలనీ రాయాలనుకొన్నారట.

దీనికంతటికి కారణం ఆఫీసరు తనను అవమానించాడని గంగారాం నీకు చెబితే నువ్వు వేసిన ప్లానట ఇది."

"ఆ...!" అంటూ నోరు తెరిచాడు విఘ్నమూర్తి.

"ఇంకా చెబుతాను విను. 'ఒరేయ్ ఇది జంబుగాడి పని. అందరూ నాకు భాగం ఉందని అనకొంటారేమో. నాకు ఫ్యూచర్ లేకుండా పోతుంది ఈ యధార్థం చెప్పి ఇందులో నా తప్పులేదని నిరూపించుకో దానికి నువ్వే సాక్షి అంటూ కన్నీళ్ళు పెట్టుకొన్నాడు. 'ఒరే ఇది ఎప్పటి కయినా బయటికొస్తుందిగదా' అన్నాను. 'బయటికొచ్చినపుడు ఆఫీసరు'

కాళ్ళు పట్టుకొని నాకేం తెలియదని జంబుగాడే చేశాడని చెబుతాను అన్నాడు.

"అప్పుడు నువ్వేమన్నావ్...?" ఆత్రతగా అడిగాడు విష్ణుమూర్తి వింటున్న వాడల్లా.

జయరాం గొంతు సవరించుకొని "చాలా బాధపడ్డాను విష్ణుమూర్తి! 'ఒరే నీ భవిష్యత్తు నువ్వు చూసుకొంటే వాడి భవిష్యత్తేమిటి' అనడిగాను. 'టైపిస్టుగాడికి భవిష్యత్తేమిటిరా. సూర్యుడే లేకపోతే చంద్రుడికి కాంతి ఎక్కడిది? నే నున్నాను కాబట్టి వాడికి అమాత్రమయినా గుర్తింపుంది' అంటూ వెళ్ళిపోయాడు."

"ఇప్పుడు నమ్మాను జయరాం. మేమిద్దరమూ అనుకొన్నది నిజమే. కాని ఇక ఆ ప్లాను అమలు జరగదు ఆ విశ్వాస ఘాతకుడికి చేసిన సేవకు ఫలితం దక్కింది. వాడికి తిలోదకాలిస్తాను. నా కష్పుడప్పుడూ డబ్బులిస్తుంటావుగా?"

"తప్పకుండా" హామీ ఇచ్చాడు జయరాం.

* * * *

ఆ రోజు గంగారాం, విష్ణుమూర్తి ఇద్దరూ వేర్వేరు సమయాల్లో ఆఫీసుకు వచ్చారు. ఇద్దరూ నాగుబాముల్లా బుసలుకొడుతూ, దెబ్బతిన్న బెబ్బులుల్లా ఒకరి నొకరు క్రూరంగా చూసుకొంటున్నారు. ఒకప్పటి ప్రాణప్రదమయిన స్నేహం ఈనాడు కర్కశంగా తయారయింది.

"మిమ్మల్ని మూర్తి పిలుస్తున్నాడండి" అన్నాడు బంట్రోతు

"ఎవడా మూర్తి? అఫ్టారిల్ టైపిస్టుగాడు నన్ను పిలవడమా?"

"ఎవర్రా అఫ్టారిలుగాడు? నువ్వేరా లుచ్చావి" కొద్దిదూరంలో కూర్చొని ఉన్న టైపిస్టు మూర్తి కడుపులోని కోపం వెళ్ళగక్కాడు.

"ఒరే నువ్వేరా లుచ్చావి. పారసైట్‌గాడివి. నా డబ్బంతా ఇంత కాలం తిన్నావు కదరా జంబుగా!"

"ఒరేయ్ మర్యాదగా మాట్లాడు. నాచేత దాస్యం చేయించుకొంటివి గదరా? నువ్వు ఫామిలీతో ఊరికి పోతూంటే సూటుకేసులు మోస్తిని గదరా? కృతఘ్నుడా, లంబుగా!"

"ఒరే నువ్వేం తేరగా మోయలేదురా. నువ్వు డబ్బుతోపాటు మా ఇంట్లో మిగిలిన కూరలూ, అన్నమూ తీసుకుపోతుంటివి గదరా హార్డీగా!"

"ఒరేయ్ నువ్వేరా లారెల్‌గాడివి. కాకపోతే అందరికీ మా పిల్ల వాడికి నీ పోలికలున్నాయని చెప్పుకుంటావట్రా గాడిద కొడ..."

"రేయ్ నువ్వేరేయ్ పంది నా కొడ...లేకపోతే నేను ఇంట్లోలేని సమయాల్లో నాకోసం వచ్చినట్లు వచ్చి మా ఆడవాళ్ళతో సరసాలాడతా వట్రా!"

ఇద్దరూ జుట్లు పట్టుకొని, అసహ్యంగా తిట్టుకుంటూ, నీచంగా మాట్లాడుకొంటూ ఆఫీసు టైంలో హోరాహోరీ గుద్దుకోసాగారు. వాళ్ళు ఉద్యోగస్థులమన్న సంగతే మరిచిపోయారు

ఇంతలో సెక్షన్ హెడ్‌ని పిలిచిన ఆఫీసరు వీళ్ళిద్దరి ఇన్‌డిసిప్లిను గురించీ, ఆఫీసులో వాళ్ళ నీతి బాహ్యమైన పరిస్థితి గురించీ తెలియజేసిన వెంటనే వీళ్ళ నిక్కడ నుంచి ట్రాన్స్‌ఫర్ చేయాలని హెడ్ ఆఫీసుకు టెలిగ్రామ్ ఇవ్వమన్నాడు. ఇద్దర్నీ రాష్ట్రంలో చెరో మూలకి ట్రాన్స్‌ఫర్ చేస్తూ మరుసటి రోజు ఉదయానికల్లా ఆర్డర్సు వచ్చాయి. ఆఫీసరు రిలీవర్సుకోసం కూడా ఎదురు చూడకుండా వాళ్ళని రిలీవ్ చేశాడు.

"ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటు చేస్తున్నాం రం"దని సెక్షన్ హెడ్ ఇద్దర్నీ పిలిచాడు.

"వాడొస్తే నే రాన"ని గంగారాం అంటే.

"వాడొస్తే నే నొస్తా"నని విష్ణుమూర్తి అన్నాడు.

"హలో సార్స్, నేను ఈ రోజు టి. వి. కొన్నాను" అంది మాధవి నవ్వుతూ. కుడివైపు నించి వస్తున్న విష్ణుమూర్తి 'ఛీ...పో...' అని ఒకర్నొకరు తిట్టుకొంటూ మాధవి మాటల్ని పట్టించుకోకుండా వెళ్ళి పోయారు.

ఆ రోజే నారాయణరావు మీదున్న ఛార్జి మెమో డ్రాప్ చేసుకొన్నాడు ఆఫీసరు, అది నిరాధారమయినందున.

మరుసటి రోజు జయశ్రీ తనకు గుంటూరులోని ఇంజినీరుతో మహూర్తం పెట్టుకొన్నారని అందరికీ వెడ్డింగు కార్డులు పంచింది. విద్యాధికుడైన ఆ ఇంజనీరు కరటక దమనకులు పంపిన ఫోటో చూసి ఇక్కడేదో తిరకాసుందని విషయమంతా విచారించి యదార్ధం తెలుసు కొన్నాడు.

కరకట దమనకులనబడే ఆ రెండు దుష్టశక్తుల మధ్యా మిత్రభేదం సృష్టించడానికి ఆఫీసు అటెండర్ల ద్వారా వాళ్ళ రహస్యాలను ఎంతో నేర్పుగా సేకరించారు. చివరకు దిగ్విజయంగా కార్యం నెరవేర్చారు ఆఫీసు స్టాఫు.

జరాసంధుడి తొడలు చీలిస్తే మరలా అతుక్కున్నట్లే కరటక దమనకులు చెరోమూల పడిపోయారని మనం సంతోషించకూడదు. మీ ఆఫీసుల్లోకి ఈ లావువాడైన లంబూ, పొట్టివాడైన జంబూ వస్తాదేమో అలర్టుగా ఉండండి.

ఎందుకంటే-

ఏకకణ జీవి బహుకణ జీవిగా జీవ పరిణామక్రమంలో మారినట్టే కరకటకుడు మీ ఆఫీసుకు వచ్చాడంటే స్థానికొడొకణ్ణి దమనకుడుగా సృష్టించుకోవచ్చు.

అలాగే దమనకుడు వచ్చాడనుకోండి అతడు కరటకుణ్ణి సృష్టించుకోవచ్చు. ఇదే అందరికీ చివరి హెచ్చరిక.

*